హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 219 | పేజీలు : 08 | బుధవారం | 19-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

కుటుంబానికి ఒక
ఎకరం భూమి

- మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం: కవిత
- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత మిగతా 2 లో
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల

మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు
అవకాశం ఇవ్వొద్దు

- అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి : సీఎం రేవంత్ రెడ్డి
- సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు
- బీఆర్ఎస్ పై విమర్శలు గుప్పించిన సీఎం
- మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపు

మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం స్ఫూర్తి నింపేలా ఉండాలి

హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని

మంత్రి పొంగులేటి
రాజీనామా చేయాలి

హరీశ్ రావు

- రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని మండిపాటు
- పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య
- కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు

మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత

బీజేపీకి అనుబంధ
మిగతా 2 లో
సంస్థగా మారిన ఎన్నికల సంఘం: టీపీసీసీ చీఫ్

15 వేల కోట్ల
పెట్టుబడులే లక్ష్యం

- జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి..
- రూ. 15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం: శ్రీధర్ బాబు
- నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న శ్రీధర్ బాబు
- కాన్ఫరెన్స్ ను నిర్వహించిన నిర్మలా సీతారామన్, పీయూష్ గోయెల్
- స్మార్ట్ సిటీ పనులను 2028 నాటికి పూర్తి చేస్తామన్న శ్రీధర్ బాబు

మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ పారిశ్రామిక రంగానికి జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఒక కొత్త ఊపునివ్వనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ స్మార్ట్ సిటీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల

రైతులపై బీఆర్ఎస్
మిగతా 2 లో
దొంగ ప్రేమ..

- రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ..మేం చేసి చూపించాం: తుమ్మల నాగేశ్వరరావు
- రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్న మంత్రి తుమ్మల
- గతంలో విడతలవారీగా చెల్లించి రైతులపై రూ.2,630 కోట్ల వడ్డీ భారం మోపారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే విడతలో రూ.20,617 కోట్లు మాఫీ చేసిందని వెల్లడి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధారమైన విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ ప్రక్రియ

వేల ఎకరాలను అక్రమంగా
లాక్కుంటున్నారు

తెలంగాణలో 22(ఎ) నిషేధిత భూముల వివాదం

హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాలను అక్రమంగా లాక్కుంటున్నారన్న ఈటల రాజేందర్

రెవెన్యూ మినిస్టర్ రాబరీ మినిస్టర్‌గా మారారన్న ఎమ్మెల్యే ఏలేటి

మంత్రి పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్న హరీశ్‌రావు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్



మిగతా 2 లో

హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాలను 22(ఎ)లో చేర్చి అక్రమంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కుంటోందని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. దీంతో రూ.పది లక్షల కోట్లు సమకూర్చుకోవాలని కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. భూములపైన

మిగతా 2 లో

హరీశ్‌రావు కాదు..
అబద్దాల రావు..

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్దాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ

కమీషన్లు దండుకుంటున్నారు

మిగతా 2 లో

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైవేలపై వాహనాల వద్ద టోల్ ఫీజు వసూలు చేసినట్లే.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కమీషన్లు దండుకుంటున్నారని బీఆర్ఎస్ నేత

- టోల్ ఫ్రీ నెంబర్ పేరుతో కమీషన్లు దండుకుంటున్నారు
- పొంగులేటిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు
- 22ఏ నిషేధిత జాబితాలో పారపాట్లను సరిదిద్దుతామని టోల్ ఫ్రీ నెంబర్ తీసుకొచ్చారన్న ప్రవీణ్ కుమార్
- ఈ టోల్ ఫ్రీ నెంబర్ వెనుక భారీ కుట్ర దాగుందని ఆరోపణ
- నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించడానికి 30 శాతం కమీషన్ అడుగుతున్నారని మండిపాటు

మత్స్యకారుల గల్లంతు పై ఆరా..

మిగతా 2 లో

- మత్స్యకారుల గల్లంతు ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా..
- కోనసీమ మత్స్యకారుల గల్లంతు ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం
- ఆగస్టు 3న వేటకు వెళ్లి తిరిగిరాని 8 మంది మత్స్యకారులు
- కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ సమన్వయంతో గాలింపు ముమ్మరం
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



హైదరాబాద్ పల్స్,డెస్క్

కోనసీమ జిల్లా మత్స్యకారులు వున్న బోటు సముద్రంలో గల్లంతయిన ఘటనపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఇవాళ సీఎంఓ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన ఎనిమిది మంది మత్స్యకారుల ఆచూకీ లభించేంత వరకు గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆయన

15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

మొదటి పేజీ రువాయి

మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. 3,245 ఎకరాల భారీ విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఈ స్మార్ట్ సిటీ ద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. జ్యూజ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో జరుగుతున్న ఈ పనులను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు.ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో తెలంగాణ ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇదే క్రమంలో, 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌ను ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు కోరారు.

మత్స్యకారుల గల్లంతు పై ఆరా..

మొదటి పేజీ రువాయి

ఆదేశించారు.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్ములపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన 8 మంది మత్స్యకారులు ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 గంటలకు ఓడలరేవు జెట్టి నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లినట్లు అధికారులు సీఎంకు వివరించారు. బయలుదేరిన గంట తర్వాత, అంటే ఉదయం 11 గంటల వరకు వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారని, ఆ తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. వారి బోటులో వీహెచ్ఎఫ్ సెట్‌తో పాటు వ్యక్తిగత మొబైల్ ఫోన్లు కూడా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.అధికారుల అంచనా ప్రకారం.. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోటు చేపలు పట్టే ప్రదేశానికి చేరుకొని ఉండవచ్చు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12 నాటికి బోటు తిరిగి రావాల్సి ఉన్నా రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించామని అధికారులు సీఎంకు తెలిపారు.కోస్ట్ గార్డ్ నౌకలను అప్రమత్తం చేసి గాలింపు చేపడుతున్నామని, అలాగే కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకార బోట్లకు కూడా సమాచారం అందించి గల్లంతైన బోటు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని అధికారులు వివరించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గాలింపు చర్యలను మరింత ఉద్ధృతం చేయాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలతో అధికారులు నిరంతరం టచ్‌లో ఉండాలని, గాలింపు వివరాలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తూ ధైర్యం చెప్పాలని సూచించారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగించాలని స్పష్టం చేశారు.

వేల ఎకరాలను అక్రమంగా లాక్కుంటున్నారు

మొదటి పేజీ రువాయి

రేవంత్ రెడ్డి డాక్టరేట్ చేశారని ఎద్దేవా చేశారు. బడంగ్?పేట్ మున్సిపాలిటీలో 5 తరాలుగా సాగు చేసుకుంటున్న వాళ్ల ఆస్తిని ప్రభుత్వ భూమి అని గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల నుంచి భూములు లాక్కుని భూమాఫియాకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ధరణి పోయినా ప్రభుత్వం భూములు లాక్కునే ధోరణి మారలేదని మండిపడ్డారు.
బీఆర్ఎస్ పార్టీ భూదందా : గతంలో బీఆర్ఎస్ కూడా కంచే చేను మేసినట్లు భూదందా చేసిందని, కేసీఆర్ భూమాఫియాకు కట్టబెట్టిన భూములను రేవంత్‌రెడ్డి సర్కార్ సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఈటల ఫైర్? అయ్యారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ భూదందాలో సంపాదించిన డబ్బును హుజూరాబాద్ ఉప ఎన్నికలో ఖర్చు చేశారని, గల్ఫ్ ఆయిల్ కంపెనీ భూములు ఫీనిక్స్ కంపెనీ మీదుగా చేతులు మారిందని తెలిపారు. రూ.20 వేల కోట్ల విలువైన భూమిని హానర్ హోమ్స్ పేరిట విల్లాలు కట్టి అమ్ముతున్నారని ఈటల వ్యాఖ్యానించారు.కోహెడలో 70 ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చిన భూములను ఇటీవల ప్రభుత్వం లాక్కుందన్న ఈటల రాజేందర్, అసైన్డ్ భూములకు కూడా పట్టా భూములకు ఇచ్చినట్లే పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాలను అక్రమంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. గతంలో కొంత భూమిని ప్రభుత్వమే పరిశ్రమల కోసం కేటాయించిందని ఎంపీ ఈటల గుర్తు చేశారు. ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన వాటిని కూడా నిషేధిత జాబితాలో చేర్చారని విమర్శలు గుప్పించారు. రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములను లాక్కుంటున్నారన్న ఆయన, గతంలో కేసీఆర్ చేసిన దానికంటే రేవంత్ రెడ్డి రెండడుగులు ముందుకెళ్లారని అన్నారు.

కుటుంబానికి ఒక ఎకరం భూమి

మొదటి పేజీ రువాయి

అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు.రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

రైతులపై బీఆర్ఎస్ దొంగ ప్రేమ..

మొదటి పేజీ రువాయి

అత్యంత పేలవంగా సాగిందని ఆయన ఆరోపించారు. రైతు రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నేతలకు లేదని ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వ వైఫల్యాలను ఆయన గణాంకాలతో సహా వివరించారు. 2014లో మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చినప్పటికీ, లక్ష రూపాయల రుణమాఫీని బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకేసారి అమలు చేయలేకపోయిందని గుర్తుచేశారు. నాలుగేళ్ల పాటు విడతల వారీగా నిధులు విడుదల చేయడంతో రైతులపై అదనంగా రూ. 2,630 కోట్ల వడ్డీ భారం పడిందని తెలిపారు. ఇక 2018లో మళ్లీ లక్ష రూపాయల రుణమాఫీ హామీ ఇచ్చి, కేవలం సగం మంది రైతులకే వర్తింపజేసి, మిగిలిన రూ. 8,379 కోట్ల బకాయిలను పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. పదేళ్ల పాటు రైతులను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు వారిపై కపట ప్రేమ చూపించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి పంట కాలంలోనే ఏకకాలంలో రూ. 20,617 కోట్ల రుణాలను మాఫీ చేసిందని తుమ్మల వెల్లడించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 25,35,964 మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రెండు లక్షల రూపాయల వరకు ఉన్న పంట రుణాలను అత్యంత పారదర్శకంగా మాఫీ చేయడం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని వివరించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రైతులకే పంట రుణ బకాయిలు అత్యంత తక్కువగా ఉన్నాయని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన నివేదిక ధ్రువీకరించిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు.

హరీశ్‌రావు కాదు.. అబద్దాల రావు..

మొదటి పేజీ రువాయి

లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. ఈరోజు (మంగళవారం) ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని పేర్కొన్నారు.

ఆ భూములను 22ఏ నుంచి తొలగిస్తాం..

హరీశ్‌రావు ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివబోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు. కేంద్రం, ఎన్నికల సంఘం, బీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నాయని.. వారి పప్పులు ఉడకనివ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

కమీషన్లు దండుకుంటున్నారు

మొదటి పేజీ రువాయి

ఆర్ఎస్ ప్రవీణ్
కుమార్ ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన ఆస్తులను సరిచేస్తామని ప్రకటించి తీసుకొచ్చిన 1800 599 4788 టోల్ ఫ్రీ నెంబర్ వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆయన విమర్శించారు.ఆ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగానే ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి 30 శాతం కమీషన్ ఇస్తేనే పని పూర్తి చేస్తామని డీల్ మాట్లాడుతున్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు నేరుగా నిధులు వసూలు చేసుకోవడానికి ఈ నెంబర్‌ను ప్రవేశపెట్టారని మండిపడ్డారు. కష్టపడి సంపాదించుకున్న ఆస్తులను, చివరకు ఇందిరమ్మ ఇళ్లను కూడా నిషేధిత జాబితాలోకి తీసుకెళ్లి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అలాగే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకే కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని విమర్శించారు. గతంలో కలెక్టర్లు, ఎమ్మార్వోలకు తెలియకుండానే పొంగులేటి 'భూభారతి' ద్వారా 22 వేల లావాదేవీలు జరిపారని, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని అన్నారు.

మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి

మొదటి పేజీ రువాయి

భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు.భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22ఆ లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22ఆ భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

బీజేపీకి అనుబంధ సంస్థగా మారిన ఎన్నికల సంఘం: టీపీసీసీ చీఫ్

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, ఆగస్టు18: 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ పామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు.దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు.ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.

మళ్లీ పాత దొరలు గద్దెనెక్కేందుకు అవకాశం ఇవ్వొద్దు

మొదటి పేజీ రువాయి

నిర్ణయించినట్లు వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం నిత్యం స్ఫూర్తి నింపేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలన్నారు. 2029లో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమావ్యక్తం చేశారు. నేత, గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ పొలాలు ఎక్కడున్నా ఈత, తాటిచెట్లు పెంచాలని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని పెంచితే కల్తీ లేని కల్లు వస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువ గట్ల వెంబడి నాటాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం

కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు.

మరోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్‌నే

గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

పాపన్న పోరాట స్ఫూర్తితో తెలంగాణలో బీసీల రాజ్యం ఏర్పాటు చేస్తాం

ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా పని చేస్తాం
టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, తెలంగాణ బ్యూరో : హైదరాబాద్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘన నివాళులు అర్పించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనను

స్మరించుకున్నారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బహుజన వర్గాల ఆత్మగౌరవం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. నాటి సామాజిక పరిస్థితుల్లో ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాడి బహుజన రాజ్యానికి పునాది వేసిన మహనీయుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో బీసీల రాజ్యాధికారం సాధించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పనిచేస్తుందని మల్లన్న స్పష్టం చేశారు. బీసీలను రాజకీయంగా, సామాజికంగా ఏకం చేసి పాపన్న గౌడ్ కలలుగన్న బహుజన రాజ్యాన్ని తెలంగాణలో స్థాపించడమే తమ లక్ష్యమని తెలిపారు.పాపన్న గౌడ్ ఆశయ సాధన కోసం బీసీలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రాజకీయ అధికారంలో తగిన వాటా దక్కే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం, బీసీల రాజ్యాధికారమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయమని, అదే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతుందని తీన్మార్ మల్లన్న గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, మైనారిటీ అధ్యక్షులు సల్మాన్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింటూ, యూత్ ప్రధాన కార్యదర్శి వీరమల్లు అనిల్, స్టేట్ ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్, నాయకులు బయ్య వెంకటేష్ యాదవ్, భాను తదితరులు పాల్గొన్నారు

ఏచ్చని చెట్లతోనే భావితరాలకు భవిష్యత్తు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి.
ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్

హైదరాబాద్ పల్స్, ఆగస్టు 18, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :పచ్చదనం పెంపొందించడంతోనే భావితరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.డోర్నకల్ పట్టణంలోని గొల్లబజార్‌కు చెందిన ఎల్లవుల యాకేశ్వర్‌రావు తన తండ్రి ఎల్లవుల మల్లయ్య జ్ఞాపకార్థం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయుల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామచంద్రనాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు



మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెట్లు స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఆస్ట్రేలియా జాతీయ మొక్క పోడోకార్పస్‌ను రాజమండ్రి సమీపంలోని కడియం నుంచి తీసుకువచ్చి నాటించిన పట్టణ లాయర్ తేజావత్ రమేష్, సంధ్యతో పాటు సీనియర్ జర్నలిస్ట్ ఠాకూర్ రాజేందర్‌సింగ్, హిందీ ఉపాధ్యాయురాలు అనితలను ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండేటి రాజకుమారి, వైస్ చైర్‌పర్సన్ మాధ లావణ్య శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, ప్రధానోపాధ్యాయులు బండి నర్సింహారావు, శంకర్, రాంనాయక్, విద్యాసాగర్, శంకరయ్య, రాంబాబు, సీతారాములు, బిచ్చా, కమల, అమీనా బీ, వసంతరాణి, మంజులత, శేషుకుమారి, వరలక్ష్మి, దమయంతి, మాలతి, ప్రశాంతి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత జౌళిశాఖ ఏడి ని కలిసిన రఘునాథపురం

బాలాజీ పవర్ లూమ్స్ సంఘం నాయకులు

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం బాలాజీ పవర్ లూమ్స్ సొసైటీ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బూరెల స్వామి ఉపాధ్యక్షులు బోద్దుల వెంకటేశం ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్ మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఏడి శ్రీనివాస్ రావు ను వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని చేనేత శాలువాలతో ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా వారికి పవర్లూమ్ కార్మికుల సమస్యల గురించి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మర మగ్గాల కార్మికులకు జియో టాక్ నెంబర్ అందరికీ కల్పించాలని, ట్రిఫ్ట్ పథకం చేనేత కార్మికులకు 8 శాతం డిపాజిట్ చేస్తే వారి ఖాతాకు ప్రభుత్వం 16 శాతం జమ చేయుచున్నది, చేనేత కార్మికులు 1200 జమ చేస్తే 2400 ఇస్తుంది, అదే ఇస్తుంది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 500 యూనిట్లు

మాదిరిగా పవర్లూమ్స్ వారికి జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణమాఫీ చేసింది, అదే తరహాలో కుటీర పరిశ్రమ కింద ఉన్న పవర్ లూమ్స్ కార్మికులకు కూడా రెండు లక్షల వరకు రుణాలు తీసుకున్న కార్మికులందరికీ రుణమాఫీ ప్రకటించాలని బ్యాంకు రుణాలకు సబ్సిడీ కల్పించాలని, కుటీర పరిశ్రమ కింద ఉన్న పవర్ లూమ్స్ వారికి 750 యూనిట్ల విద్యుత్ తమిళనాడు ప్రభుత్వం ఉచితంగా ఉచితంగా ఇస్తున్నారు, అదే మాదిరిగా మన తెలంగాణలో కూడా ప్రభుత్వం అమలు చేయాలని, చేనేత పవర్ లూమ్స్ కార్మికులను ఆదుకోవాలని ఉచిత విద్యుత్ ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా పై సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎడి శ్రీనివాసరావు, అమలయ్యే విధంగా పై సమస్యల గురించి చేనేత జోలి శాఖ కమిషనర్ కు చేనేత మంత్రివర్యులకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తారకరామా పవర్ లూమ్స్ సొసైటీ అధ్యక్షులు, గాడిపల్లి శ్రవణ్ కుమార్, శ్రీ పద్మ పవర్ లూమ్స్ సొసైటీ అధ్యక్షుడు బింగి సుదర్శన్, రాజపేట శ్రీనివాస పవర్ లూమ్స్ సొసైటీ అధ్యక్షులు ఆడపు రామకృష్ణయ్య, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్నం వెంకటరమణ, పద్మశాలి సంఘంల ప్రజా ప్రతినిధిలు, మరియు సొసైటీల ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు, కోశాధికారులు డైరెక్టర్లు సభ్యులు పాల్గొన్నారు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డీఐఈఓ బి. సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియాతో సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని కోరారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు హాజరై పాఠాలను శ్రద్ధగా విని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బి. శివకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరిశిక్షే కొనసాగుతుంది..

ప్రత్యామ్నాయ పద్ధతిపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

లెథల్ ఇంజెక్షన్ సహా ఇతర పద్ధతులకు అనుమతి నిరాకరణ.

న్యూఢిల్లీ, ఆగస్టు 18, హైదరాబాద్ పల్స్ న్యూస్ :
మరణశిక్ష అమలులో ఉరికి బదులుగా తక్కువ బాధ కలిగించే ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రవేశపెట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రస్తుతం దేశంలో మరణశిక్ష అమలు చేసే విధానంగా ఉరి కొనసాగుతుందని స్పష్టం చేసింది.జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఉరిశిక్షకు బదులుగా లెథల్ ఇంజెక్షన్, కాల్చివేత, విద్యుత్ షాక్ వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని పిటిషనర్ రిషి మల్హోత్రా కోరారు. ఉరికి బదులుగా మరింత మానవీయమైన పద్ధతి అవసరమని భవిష్యత్తులో బలమైన శాస్త్రీయ, వైద్య లేదా ఇతర ఆధారాలు లభిస్తే ఈ అంశాన్ని మరోసారి పరిశీలించే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. ప్రత్యామ్నాయ విధానాలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది.

మహారాష్ట్రలో ఆగస్టు 28 నుంచి 'మత మార్పిడి నిరోధక చట్టం' అమలు

బలవంతపు, మోసపూరిత మత మార్పిడులపై కఠిన చర్యలు

ముంబై, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ న్యూస్):
మహారాష్ట్ర ప్రభుత్వం 'మహారాష్ట్ర మత స్వాతంత్ర్య చట్టం–2026' అమలుకు తేదీని ప్రకటించింది. హోంశాఖ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ చట్టం ఆగస్టు 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది.బలవంతం, మోసం, ప్రలోభాలు లేదా వివాహం పేరుతో జరిగే అక్రమ మత మార్పిడులను అడ్డుకోవడం చట్టం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. డబ్బు, బహుమతులు, ఉద్యోగం, ఉచిత విద్య, మెరుగైన జీవనశైలి లేదా దైవిక స్వస్థత పేరుతో ఆశ చూపి మతం మార్చడాన్ని 'ప్రలోభం'గా పరిగణించనున్నారు.

కఠిన శిక్షలు:
వివాహం పేరుతో అక్రమ మత మార్పిడికి పాల్పడితే ఏడేళ్ల వరకు జైలు, రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. మైనర్లు, మహిళలు, మానసిక వైకల్యం ఉన్నవారు లేదా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారిని అక్రమంగా మతం మార్చితే ఏడేళ్ల జైలు, రూ.5 లక్షల వరకు జరిమానా విధించనున్నారు.సామూహిక మత మార్పిడులకు కూడా ఏడేళ్ల వరకు జైలు, రూ.5 లక్షల వరకు జరిమానా ఉంటుంది. నేరం పునరావృతమైతే 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది.చట్టవిరుద్ధ మత మార్పిడిపై ఫిర్యాదు అందితే సంబంధిత పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి కేసు నమోదు చేయాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.ఈ చట్టంపై రాజకీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మోసం, బెదిరింపుల ద్వారా జరిగే మత మార్పిడులను తాము వ్యతిరేకిస్తామని శివసేన (యూబీటీ) నేతలు పేర్కొనగా, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చట్టాన్ని విమర్శించారు. ఇది రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

10 వేల సంతకాలతో పిటిషన్ వస్తే సభలో గంటపాటు చర్చ జరపాలి

ఇందిరాపార్క్ ధర్నాలపైనా మండలిలో ప్రత్యేక డిబేట్ జరగాలి

శాసన మండలి రూల్స్ కమిటీలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రతిపాదన

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, తెలంగాణ బ్యూరో : హైదరాబాద్, తెలంగాణ శాసన మండలిలోని కమిటీ హాల్‌లో రూల్స్ కమిటీ ప్రాథమిక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి సభ్యులు, రూల్స్ కమిటీ సభ్యుడైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... ప్రజల సమస్యలు నేరుగా శాసన మండలి దృష్టికి వచ్చేలా ప్రజా పిటిషన్లకు డైరెక్ట్ డిబేట్ విధానం తీసుకురావాలని ఆయన ప్రతిపాదించారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్రబిందువుగా ఉండాలని, ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం, శాసనసభ్యుల దృష్టికి తీసుకురావడానికి మరింత సులభమైన, పారదర్శకమైన మార్గాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని మల్లన్న పేర్కొన్నారు. 10 వేల మంది సంతకాలతో ఈ-పిటిషన్ వస్తే సభలో గంటపాటు చర్చ జరపాలి.ప్రజల భాగస్వామ్యాన్ని శాసన ప్రక్రియలో మరింత పెంచేందుకు ఎలక్ట్రానిక్ పిటిషన్ విధానాన్ని అమలు చేయాలని తీన్మార్ మల్లన్న సూచించారు.ఒక ప్రజా సమస్యపై కనీసం 10,000 మంది పౌరులు సంతకాలు చేసిన పిటిషన్ శాసన మండలికి వస్తే, దానిని కేవలం పిటిషన్‌గా స్వీకరించి వదిలేయకుండా, సభలో కనీసం ఒక గంట పాటు ప్రత్యక్షంగా చర్చించేలా ప్రత్యేక రూల్ తీసుకురావాలని ప్రతిపాదించారు.ఇలాంటి విధానాలు యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అమలులో ఉన్నాయని, ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించిన అంశాలకు చట్టసభలో చర్చకు అవకాశం కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.“ప్రజలు ఐదేళ్లకోసారి ఓటు వేసే వారిగా మాత్రమే కాకుండా.. ప్రభుత్వ పాలన, శాసన ప్రక్రియలో నిరంతరం భాగస్వాములుగా ఉండాలి. ప్రజలు వేల సంఖ్యలో ఒక సమస్యపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తే.. ఆ సమస్యపై చట్టసభలో చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి మరింత అర్థాన్ని ఇస్తుంది” అని మల్లన్న పేర్కొన్నారు.ఈ విధానం ద్వారా విద్య, వైద్యం, నిరుద్యోగం, ఫీజులు, ఉద్యోగాలు, రవాణా, రైతులు, బీసీలు, మహిళలు, యువత, సామాజిక న్యాయం వంటి ప్రజలకు సంబంధించిన అంశాలు నేరుగా శాసన మండలి చర్చకు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఇందిరాపార్క్ ధర్నాలపై శాసన మండలిలో ప్రత్యేక చర్చ జరగాలి

అలాగే హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వేదికగా జరిగే ప్రతి ధర్నా, ప్రజా ఉద్యమంపై శాసన మండలిలో ప్రత్యేకంగా చర్చించే విధానం తీసుకురావాలని తీన్మార్ మల్లన్న మరో కీలక ప్రతిపాదన చేశారు.ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు ఇందిరా పార్క్ వేదికగా నిర్వహిస్తున్నారని, వాటిని కేవలం రోడ్డుపై జరిగే నిరసనలుగా చూడకుండా ప్రజల నుంచి వస్తున్న ప్రత్యక్ష విజ్ఞప్తులుగా ప్రభుత్వం, శాసన వ్యవస్థ పరిగణించాలని అన్నారు.ఇందిరాపార్క్‌లో ఒక వర్గం లేదా ఉద్యోగ, విద్యార్థి, రైతు, మహిళా, కార్మిక లేదా ఇతర ప్రజా సంఘాలు ధర్నా నిర్వహించినప్పుడు, ఆ సమస్యకు సంబంధించి శాసన మండలిలో నిర్దిష్ట సమయం కేటాయించి చర్చ జరిగేలా రూల్స్ రూపొందించాలని సూచించారు.“ఇందిరాపార్క్‌లో ధర్నా చేయడం అంటే ప్రజలు తమ సమస్యను ప్రభుత్వం వినాలని కోరుతున్నారనే అర్థం. ఆ సమస్యను రోడ్డుపైనే వదిలేయకుండా.. శాసన మండలిలోకి తీసుకొచ్చి చర్చించాలి. ప్రజల గొంతు ఇందిరాపార్క్‌లో వినిపిస్తే.. దాని ప్రతిధ్వని శాసన మండలిలో వినిపించాలి” అని మల్లన్న అన్నారు.ప్రజలు తమ సమస్యల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, ప్రజల నుంచి వచ్చే పిటిషన్లు, ఉద్యమాలు, నిరసనలను శాసన వ్యవస్థలోకి తీసుకురావడానికి స్పష్టమైన వ్యవస్థ అవసరమని ఆయన పేర్కొన్నారు.ప్రజల గొంతుకకు శాసనసభలో స్థానం కల్పించేలా రూల్స్‌లో మార్పులు తీసుకురావాలని, ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికలకే పరిమితం చేయకుండా ప్రతిరోజూ ప్రజల భాగస్వామ్యంతో నడిచే ప్రజాస్వామ్యంగా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.రూల్స్ కమిటీ సమావేశంలో మల్లన్న చేసిన ఈ ప్రతిపాదనలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే విధానాలపై సమగ్రంగా చర్చించి, సాధ్యమైన మార్పులను పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు.

భువనగిరిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని భువనగిరి ఖిల్లా వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ సలహాదారు, మాజీ పీసీసి అధ్యక్షులు వి.హనుమంతరావు, భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, భువనగిరి ఎమ్మార్వో జగన్, టీపీసీసీ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్ సర్దార్ సర్వాయి పాపన్న ఉత్సవ అధ్యక్షులు పంజాల జైహింద్ గౌడ్, బాలరాజ్ రాష్ట్ర గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ పీసీసీ అధ్యక్షులు బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు మాట్లాడుతూ.. “సర్దార్ సర్వాయి పాపన్న బీసీలకు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలందరికీ ఆత్మగౌరవానికి ప్రతీక. స్వాతంత్ర్యానికి ముందే వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో రాజ్యం ఏలిన గొప్ప యోధుడు. ఆయన పాల్గొన్నారు ఆశయాలను ప్రతి ఒక్కరం కొనసాగించాలి” అని అన్నారు.మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ... “సర్దార్ సర్వాయి పాపన్న కేవలం ఒక యోధుడు మాత్రమే కాదు. ఆయన బీసీ, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి చిహ్నం. మొఘలులను ఎదిరించి స్వయం పాలన సాధించిన మొట్టమొదటి తెలుగు వీరుడు. ఆయన త్యాగం, ధైర్యం నేటి యువతకు స్ఫూర్తి. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. పాపన్న కలలు కన్న సమాజ స్థాపనకు మనమందరం కృషి చేయాలి” అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్ కుక్కదుగు సోమయ్య, మజార్ పాషా (బబ్లు) కౌన్సిలర్ అనిల్, నాగారం శంకర్, కూర శివకుమార్, పిట్టల బాలరాజ్, ఆవుశెట్టి పాండు, నజీర్ భాయ్, షేక్ వాజీద్, హెరే కార్ శ్రీను, రఫిద్దీన్, గౌరీ, గౌడ సంఘం సభ్యులు,

నీటి సంరక్షణ పనులను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో శంకర్

పంట కుంటలతో భూగర్భ జలాల పెంపు

బొమ్మారెడ్డిగూడెంలో వీబీజీ-రాంజీ పంట కుంటల పనుల పరిశీలన.

చౌటకూర్, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి): వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు పంట కుంటలు ఎంతో దోహదపడతాయని ఎంపీడీవో శంకర్ అన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న నీటి సంరక్షణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చౌటకూర్ మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెం గ్రామంలో కొనసాగుతున్న వీబీజీ-రాంజీ పంట కుంటల పనులను ఎంపీడీవో శంకర్, ఉపాధి హామీ ఏపీవో రామ్మోహన్ గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలోని డీఎన్‌టీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.రైతులతో మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు అవసరమైన నీటిని అందించడంతో పాటు భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు పంట కుంటలు, ఊట కుంటలు, ఇంకుడు గుంతలు, బోరుబావుల రీచార్జ్ నిర్మాణాలు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాల్లో నీటి సంరక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో రామ్మోహన్, సర్పంచ్ జైపాల్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మరి కృష్ణ, మాజీ సర్పంచ్ కుమ్మరి సాయిలు, ఉపాధ్యాయులు సందీప్, నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ గీత తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ కు నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు

కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు మల్లికార్జున్ గౌడ్

ఆగష్టు 18, అల్వాల్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలను అల్వాల్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల్ సర్కిల్ బీజేపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ దేశానికి చేసిన సేవలను సమాజం కోసం సాగించిన పోరాటాన్ని స్మరించుకున్నారు.పాపన్న గౌడ్ ఆశయాలను తుచ తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికార్జున గౌడ్, మాధవ్, కార్తీక్ గౌడ్, సచిన్ గౌడ్, అజయ్ రెడ్డి, నిమ్మ కృష్ణారెడ్డి, అజిత్ సాయి, వినయ్ శంకర్, తూప్రాన్ లక్ష్మణ్, ఉదయ్ ప్రకాష్, కన్నా గౌడ్, అనిల్, మొయి సుజాత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రెడ్యాను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్ పల్స్, ఆగస్టు 18, నర్సింహులపేట : రోడ్డు ప్రమాదంలో ఇటీవల మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టిన విషయంలో ఆయనకు, అనుచరులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న నర్సింహులపేట మండలం వంతడుపుల గ్రామ సర్పంచ్ బాలునాయక్ ఆధ్వర్యంలో సోమవారం స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాకుబ్, నాయకులు మధుసూదన్ రెడ్డి, సర్వర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘అవును.. నేను అంధ భక్తురాలినే’ బాలీవుడ్ నటి సంచలన వ్యాఖ్యలు

భారతదేశాన్ని ప్రేమించడం, దేశ పురోగతిని కోరుకోవడం ‘అంధ భక్తి’ అనుకుంటే, తాను గర్వంగా అంధ భక్తురాలినే.. విమర్శలకు బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్ ఘాటు సమాధానం.



ముంబై, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్):
తనను ‘అంధ భక్తురాలు’ అంటూ సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్ స్పందించారు. భారతదేశాన్ని ప్రేమించడం, దేశ అభివృద్ధిని కోరుకోవడం అంధ భక్తి అనుకుంటే.. తాను గర్వంగా అంధ భక్తురాలినేనని ఆమె స్పష్టం చేశారు. తన విధేయత ఏ రాజకీయ పార్టీకి కాదని, భారతదేశానికే అని ఇషా కొప్పికర్ పేర్కొన్నారు. ‘నేషన్ ఫస్ట్’ అనే భావనతో దేశాన్ని ప్రేమించి, గౌరవించాలని సూచించారు.దేశం తమకు ఏం ఇచ్చిందనే దానికంటే, దేశానికి తామేం చేస్తున్నామనే ఆలోచన యువతలో రావాలని ఆమె అన్నారు. భారత్ మారుతున్న నేపథ్యంలో ప్రజల ఆలోచనా విధానంలోనూ మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు.తప్పనిపిస్తే ప్రశ్నించే, నచ్చితే ప్రశంసించే హక్కు తనకు ఉందని పేర్కొన్న ఇషా కొప్పికర్.. తనకు దేశమే తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

కాక్రోచ్ లకు సుప్రీం బిగ్ షాక్..!

రంగంలోకి మాజీ జడ్జి, మాజీ సీబీఐ ఛీఫ్..!

విద్యార్థుల నిరసనలపై విచారణకు సుప్రీంకోర్టు కమిటీ

మాజీ న్యాయమూర్తి, మాజీ సీబీఐ డైరెక్టర్‌తో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు.

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ న్యూస్):
ఢిల్లీలో విద్యార్థులు నిర్వహించిన నిరసనలు, పోలీసులు చేపట్టిన చర్యలపై స్వతంత్ర విచారణకు సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఈ మేరకు మాజీ న్యాయమూర్తి, మాజీ సీబీఐ డైరెక్టర్‌తో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. జంతర్‌మంతర్ సహా ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళనలు, పోలీసుల బలప్రయోగంపై దాఖలైన పిటిషన్లను విచారించిన కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. నిరసనలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కమిటీకి సమర్పించాలని సూచించింది.నిరసనల్లో మహిళా ఆందోళనకారులను లక్ష్యంగా చేసుకున్నారన్న ఆరోపణలను కూడా కమిటీ పరిశీలించనుంది. విద్యార్థుల పై నమోదైన కేసుల్లో మూసివేయాల్సిన కేసుల వివరాలను సమర్పించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కమిటీ లో సభ్యులపై సంబంధిత వర్గాలు, పిటిషనర్ల సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది ఉత్తర్వులు జారీ చేస్తామని కోర్టు తెలిపింది.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే

నివాళులర్పించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

ఆగష్టు 18, జయనగర్,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
బోయిన్ పల్లి జయనగర్ బస్ స్టాప్ వద్ద న్యూ బోయిన్ పల్లి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన వీరుడు, విప్లవ యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన రాజ్య స్థాపన కోసం కృషి చేసిన మహానీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన ధైర్యసాహసాలు, త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శనీయమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం నాయకులు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు

నూతన గ్రామ అధ్యక్షులుగా ముగ్గురు ఏకగ్రీవ ఎన్నిక

నర్సింహులపేట, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచందర్ నాయక్ ఆదేశాల మేరకు నర్సింహులపేట మండలంలో గ్రామ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటులో భాగంగా నూతన గ్రామ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దాస్రు నాయక్, మాజీ మండల అధ్యక్షుడు జినకల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దనాగారం గ్రామ అధ్యక్షుడిగా సప్పిడి వెంకట్‌రెడ్డి, పెద్దనాగారం స్టేజీ అధ్యక్షుడిగా మందాడి శ్రీపాల్‌రెడ్డి, జగ్గుతండా అధ్యక్షుడిగా భూక్య లక్పతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వే జోన్లో అభివృద్ధి, ఆధునీకరణ పనుల పరిశీలన

దసరాలోపు ప్రజలకు అందుబాటులోకి రావాలి : ఎంపీ ఈటల

ఆగష్టు 18, అల్వాల్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలో అమృత్ భారత్ పథకం కింద వేగంగా జరుగుతున్న పలు రైల్వే అభివృద్ధి పనులు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల పురోగతి పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్. అధికారులతో సమీక్షించి పనులు వేగవంతం చేయాలని సూచించారు.లెవెల్ క్రాసింగ్ 249 రైల్వే అండర్ బ్రిడ్జి, జనప్రియ 739 రైల్వే అండర్ బ్రిడ్జి,లయోలా అకాడమీ రైల్వే ఓవర్ బ్రిడ్జి బి.పి.4, వెంకటాపురం రైల్వే అండర్ బ్రిడ్జి బి.పి 5 ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఇఎన్‌ల రైల్వే అధికారులతో పాటు రాష్ట్ర కార్యనిర్వాహకులు చింతల మాణిక్ రెడ్డి,శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.అర్బన్ అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, మల్లికార్జున్, విజయ్, వినయ్, ఉదయ్, సుజాత, రాజి రెడ్డి, వెంకట్ రెడ్డి, సూర్య, కరుణ శ్రీ, అనురాధ తదితరులు ఎంపీ ఈటల వెంటే ఉన్నారు.వని యొక్క ప్రస్తుత స్థితిని మరియు ఇంకా ప్రారంభించాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దసరా లోపు పనులన్నింటినీ పూర్తి చేయాలని, అలాగే కొత్త పనులను కూడా చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు.

సీర్వాయి పాపన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సర్వాయి పాపన్నమోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బైరి విశ్వనాథం గౌడ్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో తెలంగాణ వీరుడు, బహుజన యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్నమోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి విశ్వనాథం గౌడ్, ఆలేరు మండల అధ్యక్షులు పోతుగంటి సంపత్ కుమార్ గౌడ్, సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైరి విశ్వనాథం గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న అని

కొనియాడారు. ఆయన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. తెలంగాణ శివాజీగా పేరుగాంచిన సర్వాయి పాపన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న చరిత్రను యువతకు తెలియజేసి, ఆయన చూపిన పోరాట స్ఫూర్తిని సమాజంలో కొనసాగించాలని అన్నారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని ఆయనే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు మాసాపేట రాజు గౌడ్, పాప రాజు గౌడ్, సోమలింగం గౌడ్, మిట్టపల్లి పాండు గౌడ్ , రమేష్ గౌడ్, బాగయ్య గౌడ్, రాజయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్,రవి గౌడ్, గ్రామస్థులు, నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

రాజపేటలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు..

పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని, ఆయన ధైర్యసాహసాలను, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం రాజపేట మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు, యువత, గౌడ సంఘం

నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు పాపన్న జీవిత చరిత్ర, ఆయన సామాజిక పోరాటం, సమాజంలో సమానత్వం కోసం చేసిన కృషిని వివరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక గొప్ప వీరుడు, ప్రజా నాయకుడు అని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీర్ల ఐలయ్య అన్నారు. బహుజనులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కుల, మత భేదాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.సర్దార్ సర్వాయి పాపన్న చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సమానత్వ భావనలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయాల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని బీర్ల అయిలయ్య గారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

జీవో నంబర్ 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ కోర్సులను పాత పద్ధతిలోనే కొనసాగించాలి

నారాయణఖేడ్, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి పాలసీని వెంటనే వెనక్కి తీసుకుని, ఎన్‌బీటీఈటీని బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం, డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేసే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి స్వరాజ్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థులు డిప్లొమా పూర్తి చేసిన అనంతరం బీటెక్ వంటి ఉన్నత విద్యను అభ్యసించి ఇంజనీరింగ్ రంగంలోకి వెళ్లే అవకాశం ఉందన్నారు. అయితే



డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.డిప్లొమా కోర్సులను ఇంజనీరింగ్ కోర్సులకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాల్సింది పోయి డీగ్రేడ్ చేసే విధానాలను తీసుకురావడం సరికాదన్నారు. ప్రభుత్వం శక్తి పాలసీని వెనక్కి తీసుకుని, జీవో నంబర్ 97ను రద్దు

చేయడంతో పాటు డిప్లొమా కోర్సులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్వరాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రంజిత్, అభిషేక్, హరి, సాయిరాం, సుప్రీత్, మణితేజ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

కంజిపూర్ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి

తాండ అభివృద్ధి పనులు చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్న సర్పంచ్ను తొలగించాలి.

గ్రామ కార్యదర్శి పై దుర్భాషలాడిన సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి.

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 18, నారాయణ ఖేడ్ :
తీర్మానం చేయకుండా ఏకపక్ష నిర్ణయంతో పనులు చేపిస్తూ ప్రజలపై దుర్భాషలాడుతున్న సర్పంచ్ వారి అనుచరుడు శంకర్ పై చర్యలు తీసుకోవాలని డి ఎల్ పి ఓ మరియు ఎంపీడీఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నారాయణఖేడ్ మండల్ కాంజీపూర్ తండా గ్రామంలో అభివృద్ధి పనులు వచ్చినప్పటికీ తాండ కు ఏలాంటి పనులు చేయకుండా వార్డు మేంబర్స్ తో తీర్మానాలు చేయకుండా సర్పంచు వారి అనుచరుడు శంకర్ వ్యక్తిగతంగా పనులు చేసుకుంటున్నారు. ఈ తీరుపై సెక్రటరీ మేడం అడిగితే అధికారి అని చూడకుండా తీస్మార్ ఖాన్ బిడ్డవా అంటూ, దుర్భాషలాడుతూ ఇష్టం వచ్చినట్టు సర్పంచ్ గ్రామ పంచాయతీ అధికారిపై మండిపడ్డారు అలాగే గ్రామపంచాయతీ బోరు ని వ్యక్తిగతంగా వాళ్ల పొలాలకు వాడుకుంటున్నారు. దీంతో ప్రజలు నీటి సౌకర్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊరి చెరువులు కొన్ని కబ్జాకు గురి చేశారని వారి మీద ఫిర్యాదు చేస్తే బెదిరింపులకు పాల్పడ్డారు. ఇలా ఇష్టం వచ్చినట్టు గ్రామపంచాయతీని వాళ్ల తొత్తుగా మలుచుకొని వ్యవహరిస్తున్నారని ఇలా రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న సర్పంచ్ వారి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అన్నారు గ్రామపంచాయతీ వర్కర్ మూడు నెలలు పనిచేయకుండా గ్రామ కార్యదర్శి అధికారిని బెదిరిస్తూ 33 వేల రూపాయలు డ్రా చేసి ఇవ్వడం

సర్పంచ్ అరాచకం వీటిని వెంటనే గ్రామ అభివృద్ధి కోసం రికవరీ చేసి గ్రామ పంచాయతీ అకౌంట్లో జమ చేయాలి రాత్రి సమయంలో వీధిలైట్లు లేక తాండ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అరాచకాలకు అక్రమాలకు పాల్పడుతున్న సర్పంచ్ ని పదవి నుండి తొలగించాలని లేదంటే గ్రామపంచాయతీ తాండవాసులు ఉన్నతాధికారుల కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని అన్నారు. గ్రామస్తులు రాంలాల్ దన్ రాజ్ భాస్కర్ వాసు తదితరులు ఉన్నారు.

రూ.210 కోట్ల మిషన్ భగీరథ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల, ఎమ్మెల్యే కుంభం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం ఘన్‌పూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో జరుగుతున్న రూ.210 కోట్ల మిషన్ భగీరథ ప్రాజెక్టు పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘన్‌పూర్ ట్యాపింగ్ ప్రాంతంలో జరుగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలకు త్వరితగతిన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...ఆలేరు, భువనగిరి, మేడ్చల్ నియోజకవర్గాల పరిధిలోని 574 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.210 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు.యాదగిరిగుట్టలో ఈ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామని, ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పైప్‌లైన్ పనుల్లో కొంత భాగం అటవీ ప్రాంతంలో ఉన్నందున అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను ఫేజ్--1, ఫేజ్--2లో పొందుతూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. మిగిలిన గ్యాప్ పనులను కూడా త్వరగా పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.అక్టోబర్ 2026 నాటికి గ్యాప్ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఘన్‌పూర్ ట్యాపింగ్ వద్ద

హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి నుంచి రోజుకు 80 ఎం.ఎల్.డి నీటి సరఫరాను అనుసంధానం చేయడంతో పాటు, సుమారు 100 ఎం.ఎల్.డి శుద్ధి చేసిన నీటిని అదనంగా సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

గత పాలనలో తాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీర్ల ఐలయ్య అన్నారు. గత పదేళ్ల పాలనలో తెలంగాణలో సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని భారీగా దుర్వినియోగం చేశారని ఆయన విమర్శించారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టుల పేరుతో, మిషన్ భగీరథ పేరుతో కోట్లాది రూపాయలు దండుకున్నారని ఆరోపించారు.అప్పటి పాలకులు ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడేలా పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టలేదని, భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని బీర్ల ఐలయ్య తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మిషన్ భగీరథ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి శ్రీమతి సీతక్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి

విక్రమార్క సహకారంతో నిధులు మంజూరు చేయించుకుని, అటవీ ప్రాంతాల్లో అవసరమైన అనుమతులు సాధిస్తూ పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అటవీ ప్రాంతాల్లో అనుమతుల సమస్యల కారణంగా నిలిచిపోయిన పనులకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ అనుమతులు పొందుతున్నామని చెప్పారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే ఆయా గ్రామాలు, ఆవాసాలు, ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేకుండా అవసరమైన ప్రాంతాల్లో మిషన్ భగీరథ పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలకు భిన్నంగా ప్రజా ప్రభుత్వంలో ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే వినియోగించేలా పారదర్శక పాలన సాగిస్తున్నామని తెలిపారు. సాగునీరు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే మూడు నియోజకవర్గాల పరిధిలోని వందలాది గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని బీర్ల ఐలయ్య అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఇంజనీర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పక్షం రోజుల్లోనే విద్యుత్ సమస్య లేకుండా చేశాం

- జిల్లా విద్యుత్ అధికారిని కలిసి సమస్య విద్యుత్ తీర్చిన చైర్మన్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, కోహిర్:
నూతనంగా ఏర్పడిన కోహిర్ మున్సిపాలిటీ పరిధిలోని గతంలో తీవ్రమైన విద్యుత్ సమస్య ఉండేదాని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కోహిర్ మున్సిపాలిటీలోని దాదాపు అన్ని వార్డుల్లో విద్యుత్ సమస్య తీర్చమని కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ అన్నారు. మున్సిపాలిటీలో విద్యుత్ సమస్యను దృష్టిలో పెట్టుకొని జిల్లా విద్యుత్ అధికారిని కలిసి వినతిపత్రం అందజేసిన విద్యుత్ సమస్య వివరించడంతో మున్సిపాలిటీ లో గత 6,నెలల్లోనే 3,100కేవీ ట్రాన్స్ఫార్లు అమర్చడం జరిగిందని దాని వల్ల మున్సిపాలిటీ ప్రజల సమస్య పూర్తిగా తిరిపోయిందని ఇంకా ఏమైన చిన్న సమస్యలు ఉన్న విడతలవారీగా విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని కోహిర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ అన్నారు. ఈ విషయానికి సంబంధించి, కోహిర్ మున్సిపల్ ప్రాంతంలో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ మౌలిక సదుపాయాల సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరిగింది అన్నారు. మున్సిపాలిటీలో తరచుగా విద్యుత్ అంతరాయాలకు గురవడమే కాకుండా ప్రజల భద్రతకు సంబంధించిది కాబట్టి విద్యుత్ సమస్య పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నాగల్‌గిద్ద, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు, సర్పంచులను ఎమ్మెల్యే అడిగి వివరాలు తెలుసుకున్నారు.ముఖ్యంగా విద్యుత్, విద్య, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.విద్యుత్ సమస్యలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలకు

మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాఘవపూరంలో వయోవృద్ధుల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం రాఘవపురం గ్రామంలో వయోవృద్ధుల కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ పరిదె మమత సంతోష్,ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా సభ్యులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ,ఒగ్గు క్రిష్టఫర్, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి పరిగల రాములు, కొలనుపాక వయోవృద్ధుల కమిటీ అధ్యక్షులు గాదె రాజిరెడ్డి పాల్గొన్నారు.ఈ సమావేశానికి గ్రామానికి చెందిన సుమారు 50 మంది వయోవృద్ధులు హాజరయ్యారు.

మృతదేహాన్ని బురదలో మోసుకెళ్లిన గ్రామస్తులు

కబ్జాకు గురైన స్మశాన వాటిక స్థలం



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చిన్న ముసిలేరు గ్రామంలో మంగళవారం తుర్రం. పెంటమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యం మృతి చెందారు. గ్రామంలో స్మశాన వాటికకు రహదారి లేక కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్తులు, నానా ఇబ్బందులు పడుతూ వరిచేలో నుంచి స్మశాన వాటిక వద్దకు ఎంతో కష్టపడి మృతదేహాన్ని తీసుకువెళ్లారు. స్మశాన వాటికకు రహదారి లేక గత కొన్ని ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నామని ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి రహదారి ఏర్పాటు చేయాలని ఆక్రమణకు గురైన స్మశాన వాటిక స్థలాన్ని గుర్తించి స్మశాన వాటికకు కేటాయించాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో సామాజిక న్యాయాన్ని సాధిద్దాం

బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ

వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ లో పాపన్న వర్ధంతి

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, తెలంగాణ బ్యూరో :
బహుజన వీరుడు, గోల్కొండ ఖిల్లాను ఏలిన రాజు సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వరంగల్ బార్ హాల్ లో మంగళవారం ఘనంగా జరిగింది. వరంగల్, హనుమకొండ బార్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ లు మాట్లాడుతూ... సమస్త పీడిత ప్రజల విముక్తి కోసం సాహసోపేతమైన పోరాటం చేసి గోల్కొండ కోటపై రాజ్య నిర్మాణం చేసిన పాపన్న స్ఫూర్తితో సామాజిక న్యాయానికి పెద్ద పీట వేయాలని, న్యాయవాద రంగంలో అణగారిన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే గొప్ప వీరుడిగా పేరుగాంచిన సర్వాయి పాపన్న వరంగల్ జిల్లా ఖిలాషాపూర్ లో జన్మించడం మనకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ... కడు పేదరికంలో జన్మించి భూస్వాముల దగ్గర కూలీ చేసుకునే పాపన్న పీడిత ప్రజల కష్టాలను చూసి చలించి ప్రజలను చైతన్యం చేసి, ప్రజల చేత యుద్ధం చేపించి అంతిమంగా ఆనాటి మొగల్స్ రాజ్యాన్ని హస్తగతం చేసుకొని ప్రజా రాజ్యాన్ని ఏర్పాటు చేయడం భారతదేశంలోనే గొప్ప విషయమని అన్నారు. పాపన్న లాంటి

ఎందరో బహుజన మహా వీరులు దేశంలో విముక్తి పోరాటాలు చేసి విజయాలు సాధించారని, తీవ్ర నిర్బంధం, ఎలాంటి సౌకర్యాలు లేని కాలంలో పీడిత ప్రజలను చైతన్యం చేసి విముక్తి పోరాటాలను విజయవంతం చేసి రాజ్యాలను ఏలిన ఛత్రపతి శివాజీ, పండుగ సాయన్న, సాహుమహారాజ్ లాంటి వీరుల స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు కృషి చేయాలని అన్నారు. మూడు వందల ఏండ్ల క్రితమే తన రాజ్య పాలనలో సామాజికన్యాయాన్ని అమలు చేసిన పాపన్న స్ఫూర్తితో నేటి రాజ్యంలో సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా దక్కాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శులు నాగేంద్రచారి, ఊరుగొండ నరేందర్, ఉపాధ్యక్షులు సాంబశివరాజు, రఘుపతి, మహిళా ఉపాధ్యక్షులు లలిత కుమారి, వనజ, బార్ అసోసియేషన్ నాయకులు జంగ స్వప్న, ఎస్ కవిత, ఆడెపు సునీల్, ఉమా మహేశ్వరి, గొడిశాల సుజాత, పూసపెల్లి శ్రీనివాస్, మహేందర్ తో పాటు న్యాయవాదులు బత్తిని రమేష్ గౌడ్, శ్రీధర్, రామనాథం, కోటేశ్వరరావు, కిషన్ గౌడ్, పైళ్ల సంతోష్ తదితరులు హాజరై పాపన్న చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు.

రూ.8,452 కోట్లకు చేరిన పీఎం కేర్స్ ఫండ్

తొలిసారి ఆడిట్ వివరాలను వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 18, హైదరాబాద్ పల్స్ న్యూస్ :
కోవిడ్–19తో పాటు అత్యవసర పరిస్థితులు, ప్రకృతి విపత్తుల్లో ప్రజలకు సహాయం చేసేందుకు ఏర్పాటు చేసిన పీఎం కేర్స్ ఫండ్ ఆడిట్ వివరాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అధికారిక నివేదిక ప్రకారం ఫండ్‌లో ప్రస్తుతం రూ.8,452.07 కోట్ల నిధులు ఉన్నాయి.ఫండ్‌లోని సుమారు 93 శాతం నిధులు, అంటే రూ.7,846.65 కోట్లు వివిధ బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్నట్లు నివేదిక పేర్కొంది. వీటి ద్వారా ఏడాదికి రూ.469.38 కోట్ల వడ్డీ ఆదాయం వచ్చినట్లు తెలిపింది.దేశీయ విరాళాల ద్వారా రూ.479.04 కోట్లు సమకూరగా, విదేశీ విరాళాల ద్వారా రూ.92.83 లక్షలు వచ్చినట్లు వెల్లడించింది. 2020 మార్చిలో కరోనా విపత్తు సమయంలో పీఎం కేర్స్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల సంక్షేమానికి సంబంధించిన 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' వంటి కార్యక్రమాలకు ఈ నిధి నుంచి సహాయం అందిస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యానికి తావులేదు : ఎమ్మెల్యే జీఎంఆర్

పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేయాలి

పటాన్‌చెరు, ఆగస్టు 18, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :

నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని పటాన్‌చెరు ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. రూ.75 కోట్ల విలువైన పనులపై నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించిన ఆయన.. పనులు ప్రారంభించని, నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్‌లో పోచారం, లకడారం సబ్‌స్టేషన్లను ప్రారంభించేందుకు

చర్యలు చేపట్టాలని, లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల ప్రతిపాదనలపై దృష్టి పెట్టాలని సూచించారు. పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యంపై రాంకీ సంస్థపై ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ప్రతి వీధిలో వీధిదీపాలు వెలిగేలా చూడడంతో పాటు నూతన కాలనీల్లో లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం ప్రాంతాల్లో నూతన కాలనీలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇస్నాపూర్ చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, యూజీడీ పనులు చేపట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. చేయూత పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన వారికి మాత్రమే లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాకిస్తాన్ కూటమికి భారత్ ఝలక్..! ఈజిప్ట్ నిర్ణయం వెనుక ?

పాక్ కూటమికి దూరంగా ఈజిప్ట్..
భారత్‌తో సంబంధాలే కారణమా?.
సౌదీ-పాక్-టర్కీ రక్షణ కూటమిలో చేరని ఈజిప్ట్.

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ న్యూస్):

పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు ఏర్పాటు చేసిన మక్కా రక్షణ కూటమిలో ఈజిప్ట్ చేరకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రాంతీయ భద్రత నేపథ్యంలో ఏర్పాటైన ఈ కూటమిలోకి ఈజిప్ట్ కూడా చేరుతుందని తొలుత ప్రచారం జరిగినప్పటికీ, ప్రస్తుతం ఆ దేశం దూరంగా ఉంది. భారత్‌తో ఉన్న సుదీర్ఘ స్నేహ సంబంధాలను దృష్టిలో ఉంచుకుని ఈజిప్ట్ కూటమిలో చేరకుండా ఉండి ఉండొచ్చన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. భారతదేశం వంటి దేశాలతో సంబంధాలను దెబ్బతీసుకునే ఉద్దేశం ఈజిప్ట్‌కు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత్, ఈజిప్ట్ మధ్య దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయి. 1956లో సూయజ్ సంక్షోభ సమయంలో ఈజిప్ట్‌కు భారత్ మద్దతుగా నిలిచింది. అనంతరం 1961లో గోవా విముక్తి సమయంలో ఈజిప్ట్ కూడా భారత్‌కు సహకరించింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ కూటమిలో చేరకుండా ఈజిప్ట్ తీసుకున్న నిర్ణయం వెనుక భారత్‌తో ఉన్న వ్యూహాత్మక, దౌత్య సంబంధాలు కూడా

ఒక కారణంగా ఉండొచ్చని అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంశంపై ఈజిప్ట్ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

నిషేధిత 22-ఎ బాధితులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

పేద ప్రజల రక్తాన్ని తాగేందుకే 22-ఎ చట్టాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
కష్టపడి సంపాదించుకున్న పేద ప్రజల ఇండ్లు, ఇండ్ల స్థలాలను లాక్కోవాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
వెంటనే నిషేధిత 22-ఎ చట్టాన్ని రద్దు చేసి బాధితులకు న్యాయం చేయాలి
బీజేపీ పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం తీసుకొచ్చిన 1977 ఆక్ట్ 22- ఏ చట్టం బాధితులను మంగళవారం రోజు కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ... మేము ముందే చెప్పాము పాలాభిషేకలు వద్దురా నాయనా అంటే పడి పడి మరి ఈ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకి పాలాభిషేకం చేసి అప్పుడే అయిపోయినట్టుగా సంకలు గుద్దుకొని డప్పులు కొట్టి మురిసిపోయిరి ఇంతవరకు కూడా ఒక్క అడుగు ముందు పడకు పోగా తిరిగి దాంతోటే రాష్ట్రంలో ఉన్నటువంటి ఎంతో మంది పేద ప్రజలను భయపెట్టి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసే

విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తిస్తుంది. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరు చెప్పి అమాయకులను పెట్టుబడిదారులను బ్లాక్మెయిల్ చేసి అధికారుల ద్వారా కోట్లు రూపాయలు దండుకోవడం జరిగింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం పనికిరాని 22-ఎ చట్టాన్ని తీసుకువచ్చి దాంట్లో కొన్ని లక్షల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రాపర్టీలను చేర్చి ఈరోజు వాటి క్లియరెన్స్ అడిగితే లంచాల రూపంలో ఈ ప్రభుత్వం దోచుకుంటుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొన్నటికి మొన్న 22-ఎ పూర్తిగా ఎత్తేసి అక్కడ ఉండే ప్రజలకు దాని కిందన ఉన్న బాధితులు అందరికీ భారీ ఉపశమనం కలిగించి ప్రజల మన్ననలను పొందిరు. కానీ మన తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రక్త పీషాసిలాగా పేద ప్రజల రక్తాన్ని దోచుకోవాలని చెప్పేసి ఈరోజు ప్రవర్తిస్తా ఉంది కావున ఆరోజు మేము చేసిన పోరాటంలో భాగంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు నియోజవర్గం మొత్తం పర్యటించి అందరికి భరోసా ఇచ్చిరు మరి ఇప్పుడు మేము అడుగుతున్నాం అన్న మరి ఏమైంది ఎంఆర్ఓ ఆఫీస్ దగ్గరికి పోతే పట్టించుకుంటలేరు సబ్ రిజిస్టర్ ఆఫీస్ కి పోతే రిజిస్ట్రేషన్ చేస్తలేరు కావున తక్షణం ఇలాంటి అబద్ధాల రాజకీయాలు కాకుండా చిత్తశుద్ధితో ప్రజలను వంచించకుండా మీరు ఇండ్లను ఇండ్లస్థలాల భూములను రిజిస్ట్రేషన్ చేయాలని మేము డిమాండ్ చేస్తా ఉన్నాం అని అన్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ఈ నిషేధిత ప్రజలు మీకు బుద్ధి చెప్తారు అని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు భువనగిరి శ్యాంసుందర్, బెల్లిదే అశోక్ , జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్ర మౌళి పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్, పలుగుల సురేష్, ఉపాధ్యక్షులు ఆలేటి కర్ణ, మిర్యాల కృష్ణ బీజేవైఎం పట్టణ నాయకులు బుచ్చి బాబు , దొమ్మాట నరేష్, ఆకుల దేవేందర్, వంశీ, శ్రీశైలం, బుదారం రమేష్,శ్యామ్, చందు , ప్రవీణ్ , శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో వయోవృద్ధుల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో మంగళవారం వయోవృద్ధుల కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ వడ్ల శోభన్‌బాబు ఉపసర్పంచ్,వార్డు సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, ఒగ్గు క్రిష్టఫర్,మండల కమిటీ సభ్యులు పరిగల రాములు, గాదె రాజిరెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది వయోవృద్ధుల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చౌడాపోయిన సంజీవులు, ప్రధాన కార్యదర్శిగా గిరిపోయిన సత్తయ్య ఎన్నికయ్యారు.గౌరవ సలహాదారుగా నరసమ్మ, వజ్రమ్మ, శాంతమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం కమిటీ సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు.గ్రామంలోని వయోవృద్ధులందరినీ కలుపుకొని వారి హక్కులు, సంక్షేమ పథకాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, జిల్లా, మండల కమిటీ ప్రతినిధులతో పాటు గ్రామంలోని వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

బోయిన్‌పల్లి, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):

బోయిన్‌పల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయనగర్‌లోని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, పాండు యాదవ్, భానుక మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం, సామాజిక సమానత్వం కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల నిర్వహణలో భారత్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : డొనాల్డ్ ట్రంప్

అమెరికా ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలకు ట్రంప్ పిలుపు.

వాషింగ్టన్, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ న్యూస్):

అమెరికా ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల విధానాన్ని ఆయన ప్రశంసిస్తూ, ఎన్నికల నిర్వహణలో భారత్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.అమెరికా ఎన్నికల్లో ఓటు వేసేందుకు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరి చేయాలని ట్రంప్ పేర్కొన్నారు. ఇందుకోసం 'సేవ్ అమెరికా యాక్ట్' బిల్లును వెంటనే ఆమోదించాలని పిలుపునిచ్చారు.తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారని, ఫొటో గుర్తింపు విధానం అమలులో ఉందని ఆయన పేర్కొన్నారు.అమెరికాలో మెయిల్-ఇన్ ఓటింగ్‌పై వివాదాలు ఉన్నాయని ప్రస్తావించిన ట్రంప్.. ఎన్నికల్లో ఓటర్ల నమోదు, గుర్తింపు నిబంధనలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

వాన కోసం ఆకాశం వైపు చూస్తున్న అన్నదాత

ప్రతిరోజూ ఒకే ఆశ.. ఈరోజైనా వర్షం కురుస్తుందేమో!

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18:

ఆకాశం వైపు దీనంగా చూస్తున్న ఈ రైతు చిత్రం.. అన్నదాత జీవితంలోని ఎన్నో కష్టాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతుకు ప్రతి మేఘం ఒక ఆశగా, ప్రతి చినుకు ఒక భరోసాగా మారుతోంది. "ఈరోజైనా వర్షం పడుతుందేమో" అన్న ఆశతో ప్రతిరోజూ ఆకాశం వైపు చూస్తున్న పరిస్థితి రైతు జీవితంలోని అనిశ్చితిని ప్రతిబింబిస్తోంది.వ్యవసాయం పూర్తిగా వర్షాలపై ఆధారపడే ప్రాంతాల్లో వాన ఆలస్యం అయితే రైతులపై ఆర్థిక భారం పెరుగుతుంది. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెట్టి పంట సాగు ప్రారంభించిన తర్వాత సరైన సమయంలో వర్షం లేకపోతే పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులకు తగిన సూచనలు, ప్రత్యామ్నాయ సాగు ప్రణాళికలు అందించాల్సిన అవసరం ఉంది. 2026 వానాకాలంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేసినట్లు ఇప్పటికే అధికారులు వెల్లడించారు. అలాగే ఆగస్టులో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు, ఐఎండీ అంచనాలను ప్రస్తావించారు.రైతుకు వర్షం అంటే కేవలం నీరు కాదు.. అది పంటపై ఆశ, కుటుంబ భవిష్యత్తుపై నమ్మకం, అప్పులు తీర్చాలనే ధైర్యం. అందుకే ఆకాశం వైపు చూస్తున్న ప్రతి రైతు చూపు వెనుక ఒక కుటుంబం భవిష్యత్తు దాగి ఉంటుంది.

"రైతు కళ్లలో కనిపించేది వాన కోసం ఎదురుచూపు కాదు.. తన బతుకుపై ఉన్న ఆశ."

శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మదేవి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం

అధినేత తూర్పు రమేష్

వార్షికోత్సవ ఆహ్వానం

అమ్మ వారి సన్నిధిలో టీ. ఆర్.9 టీవీ

న్యూస్ ప్రతినిధులు

ఆగష్టు 18, దమ్మాయిగూడ,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ ఇందిరానగర్ కాలనీ, అహ్మద్ గూడ (బండ్లగూడ) లో స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ పరాభవ నామ సంవత్సర శ్రావణమాస శుద్ధ పంచమి అనగా తేది 17-08-2026 సోమవారం రోజున శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవము కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఉదయం 4.30 గణపతి పూజ, పుణ్యవచనం, రక్షాబంధనంపంచగవ్య ప్రాసన చండీ మండపారాధన 5.30 గణపతి హోమము, వాస్తు హోమము, నవగ్రహ హోమము, చండీ హోమం 8.30 అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన 9.30 లలిత సహస్రనామ పారాయణము మ॥ 12.30 ని॥లకు మహా నైవేద్యం, మంగళహారతి తీర్థప్రసాద వితరణ అన్నప్రసాద వితరణ సాయంత్రం 3.00 గం॥లకు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి కళ్యాణ మహోత్సవము మంగళహారతి, తీర్థప్రసాద వితరణ.సాయంత్రం 4.00 గం॥లకు

ఒగ్గు పూజారుల ఆధ్వర్యములో ఎల్లమ్మ తల్లి పుట్ట బంగారం తెచ్చుట కార్యక్రమం మరియు ఒగ్గు కళాకారులచే రేణుక ఎల్లమ్మ తల్లి కథ గానము.తేది. 18-08-2026 మంగళవారం రోజున ఉదయం 7.00 గం॥లకు ఒగ్గు పూజారుల ఆధ్వర్యములో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి కళ్యాణ మహోత్సవము వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12.00 గం॥లకు రేణుక ఎల్లమ్మ పట్నాలు, అనంతరం భోనాల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక సభ్యుడు మరియు టీ. ఆర్. 9 టీవీ న్యూస్ ఛానల్ అధినేత ఆహ్వానం మేరకు చివరి రోజు మంగళవారం టీ. ఆర్. 9 టీవీ న్యూస్ ఛానల్ ప్రతినిధులు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా తూర్పు రమేష్, టీ.ఆర్.9 టీవీ ప్రతినిధులు మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖ శాంతులతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.భక్తి, ఆధ్యాత్మికతతో ప్రజలను ఏకం చేసే ఇలాంటి ఆలయ వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు వ్యవస్థాపక శాశ్వత చైర్మన్ చిందం మల్లేష్ శవంశరాజ్, దమ్మాయిగూడ మాజీ కౌన్సిలర్, వ్యవస్థాపక సభ్యుడు, మంగళపూరి వెంకటేష్, వ్యవస్థాపక సభ్యురాలు చిందం యాదమ్మ, వ్యవస్థాపక సభ్యుడు శ్యామల శంకర్ వంశరాజ్, వ్యవస్థాపక సభ్యుడు మరియు టీ. ఆర్. 9 టీవీ న్యూస్ ఛానల్ అధినేత తూర్పు రమేష్, మేనేజర్ నీరాజా, టీ.ఆర్.9 టీవీ న్యూస్ ఛానల్ సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ బైరి విశ్వనాథం గౌడ్, టీ.ఆర్.9 టీవీ న్యూస్ ఛానల్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సంతోష్ కుమార్ పూదరి,రవి కిరణ్, మాడుగుల శంకర్, హేమంత్ కుమార్, ఏర్పుల కుమార్, కరుణాకర్ రెడ్డి, ఇందిరా నగర్ కాలనీ సభ్యులు, ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందు కార్మికుల ధర్నా

న్యాయ పరమైన డిమాండ్లపై

బి.ఆర్.టి.యూ యూనియన్ పోరాటం

సంఘీభావం తెలిపిన రాష్ట్ర కార్మిక

నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

ఆగష్టు 18, గుండ్ల పోచంపల్లి(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):

మేడ్చల్ గుండ్ల పోచంపల్లి ఇండస్ట్రీ లోని "మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్మికుల పట్ల చూపిస్తున్న అరాచకంగా, అన్యాయంగా అణచివేత ధోరణి అవలభిస్తుందని,వేతనాలు పెంచాలని కంపెనీ ఎదుట కార్మికులు సమ్మె రెండవ రోజుకు చేరుకుంది. గత మూడు సంవత్సరాల నుండి కార్మికుల హక్కులకై పోరాటం చేస్తున్నామని పలు దఫాలుగా యాజమాన్యంతో చర్చలు జరిపిన ఫలితం లేదని అందుకనే సమ్మె చెప్పట్టామని పేర్కొన్నారు. వేతనాలు పెంచకపోవడం అక్రమ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇకనైనా చర్చల ద్వారా వేతన ఒప్పందాన్ని, హక్కులను హక్కుల కోసం పోరాడిన డిస్మిస్ చేసిన వైస్ ప్రెసిడెంట్ బాల మల్లేశంని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, బి.ఆర్.టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి మాట్లాడుతూ యూనియన్ కార్మిక నాయకులు మాట్లాడుతూ వెంటనే కార్మికులకు రావాల్సిన వేతనం పెంచాలని, అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ ప్రతి ఒక్కరికి ఉండాలని తెలిపారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని సంఘీభావం తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాయ రాజయ్య, జనరల్ సెక్రెటరీ జె సంతోష్ కుమార్, ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్,జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఓట్లతో గెలిచి.. బీసీలనే మోసం చేస్తారా?

రేవంత్ రెడ్డికి తీన్మార్ మల్లన్న సవాల్

కొడంగల్‌లో బీసీల ఓట్లు 1,36,034

రెడ్డి ఓట్లు 12,567 మాత్రమే

బీసీల ఓట్లతోనే సీఎం అయ్యావ్

ఇక బీసీల రాజ్యాధికారాన్ని అడ్డుకోలేరు

జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్రలో

బీసీలదే మెజారిటీ

59 నియోజకవర్గాల్లో బీసీల గెలుపే

లక్ష్యంగా సర్జికల్ స్ట్రైక్ 59

టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, తెలంగాణ బ్యూరో :

హైదరాబాద్, బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. అదే బీసీలకు రాజకీయంగా అన్యాయం చేస్తే ఇక సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు.కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,36,789 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 1,36,034 మంది బీసీ ఓటర్లు ఉన్నారని మల్లన్న పేర్కొన్నారు. అంటే నియోజకవర్గంలో బీసీల వాటా 57.45 శాతమని తెలిపారు. అదే సమయంలో రెడ్డి ఓటర్లు కేవలం 12,567 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. బీసీల ఓట్లతోనే రేవంత్ రెడ్డి రాజకీయంగా ఎదిగారని.. బీసీలే లేకపోతే కొడంగల్‌లో ఆయనకు రాజకీయ బలం ఎక్కడి నుంచి వస్తుందని మల్లన్న ప్రశ్నించారు. కొడంగల్ బీసీల గడ్డ అని, ఎన్. వెంకటయ్య, సూర్యనారాయణ వంటి బీసీ నాయకుల రాజకీయ వారసత్వం ఈ ప్రాంతానికి ఉందని గుర్తుచేశారు.

జడ్చర్లలోనూ బీసీలదే ఆధిపత్యం

జడ్చర్ల నియోజకవర్గంలో 1,37,748 మంది బీసీ ఓటర్లు ఉన్నారని.. మొత్తం ఓటర్లలో 62.47 శాతం బీసీలేనని మల్లన్న తెలిపారు. రెడ్డి ఓటర్లు కేవలం 10,499 మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు.ఎర్ర సత్యం వంటి బీసీ నాయకుడి రాజకీయ వారసత్వాన్ని దెబ్బతీశారని... ఆ వారసత్వాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. ఎర్రశేఖర్, మధుసూదన్ యాదవ్, ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ వంటి నాయకులు బీసీ రాజకీయ శక్తికి ప్రతినిధులుగా నిలుస్తున్నారని తెలిపారు.

మహబూబ్‌నగర్.. దేవరకద్రలోనూ ఇదే లెక్క

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 1,57,839 మంది బీసీ ఓటర్లు ఉండగా.. రెడ్డి ఓటర్లు 12,031 మంది మాత్రమే ఉన్నారని మల్లన్న తెలిపారు. బీసీల ఓట్లను రాజకీయంగా ఉపయోగించుకుని..రెడ్ల ఆధిపత్యం కొనసాగిస్తూ బీసీలను అణగదొక్కుతూ వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారుదేవరకద్రలో కూడా బీసీ ఓటర్లు భారీ సంఖ్యలో ఉన్నారని.. రెడ్డి ఓటర్ల కంటే బీసీల సంఖ్య దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉందని తెలిపారు. బాలకృష్ణ, వర్మ ముదిరాజ్, కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ వంటి బీసీ నాయకత్వం అక్కడ బలంగా ఉందని తెలిపారు.

బీసీల ఓట్లతో గెలిచి.. బీసీలకే అన్యాయమా?"

బీసీల ఓట్లు ఎన్నికల్లో అవసరం.. కానీ బీసీలకు రాజ్యాధికారం మాత్రం అవసరం లేదన్నట్టుగా పాలకులు వ్యవహరిస్తున్నారని మల్లన్న మండిపడ్డారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, జనాభా ఆధారిత హక్కులు, కులగణన వంటి అంశాలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

"సర్జికల్ 59"తో రాజకీయ సమీకరణాలకు చెక్

తెలంగాణలో 119 నియోజకవర్గాల్లో బీసీల రాజకీయ శక్తిని ఏకం చేయడమే లక్ష్యంగా "సర్జికల్ స్ట్రైక్ 59" వ్యూహాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ద్వారా ముందుకు తీసుకెళ్తున్నామని మల్లన్న ప్రకటించారు. బీసీల ఓట్లను విడదీసి అధికారాన్ని కొద్దిమంది వర్గాల చేతుల్లో ఉంచే రాజకీయాలకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు.బీసీలు ఇక మేల్కొన్నారని.. తమ ఓటు విలువను అర్థం చేసుకున్నారని మల్లన్న అన్నారు. "ఇక మా ఓటు.. మా రాజ్యాధికారం" అనే నినాదంతో బీసీలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2028 ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో బీసీల కొత్త రాజకీయ శక్తికి నాంది పలుకుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో భారీగా కల్తీ నెయ్యి పట్టివేత

36 టన్నుల కల్తీ పదార్థాలు సీజ్.. 130 కేంద్రాల్లో తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):

హైదరాబాద్‌లో కల్తీ నెయ్యి తయారీ కేంద్రాలపై హెచ్-ఫాస్ట్ అధికారులు, ఆహార భద్రతా శాఖ సంయుక్తంగా భారీ దాడులు నిర్వహించారు. నగర కమిషనరేట్ పరిధిలోని 130 కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి సుమారు 36 టన్నుల కల్తీ నెయ్యి, ముడి పదార్థాలు, రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు.స్కిమ్డ్ మిల్క్, క్రీమ్, పామాయిల్, వనస్పతి, స్టార్చ్ తదితర పదార్థాలతో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రముఖ బ్రాండ్ల పేర్లతో కల్తీ నెయ్యిని మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.స్వాధీనం చేసుకున్న పదార్థాల్లో 25.5 టన్నుల కల్తీ నెయ్యి, 8.7 టన్నుల క్రీమ్, 1,200 లీటర్ల పామాయిల్, 600 లీటర్ల వనస్పతి ఉన్నట్లు అధికారులు తెలిపారు. నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు.ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా నెయ్యి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రజలు కల్తీ ఆహార పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆందోళన.. ఆసుపత్రికి తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశం

జైలు నుంచి ఆసుపత్రికి తరలించి సమగ్ర వైద్య పరీక్షలు చేయాలని ఆదేశం

ఇస్లామాబాద్, ఆగస్టు 18 (హైదరాబాద్ పల్స్):

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ దేశ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రావల్పిండిలోని అడియాలా జైలు నుంచి ఆయనను ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ ఆసుపత్రికి తరలించి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.జస్టిస్ షాహిద్ వహీద్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఇమ్రాన్ ఖాన్ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఆయన వ్యక్తిగత వైద్యుడితో పాటు సోదరి ఉజ్మా ఖాన్‌ను కూడా సభ్యులుగా చేర్చి ప్రత్యేక వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని సూచించింది.అలాగే ఇమ్రాన్ ఖాన్‌ను ప్రతి వారం కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతించాలని జైలు అధికారులను ఆదేశించింది. అయితే వైద్య నివేదికలను మీడియాకు వెల్లడించి అంశాన్ని రాజకీయంగా మార్చవద్దని న్యాయవాదులు, కుటుంబ సభ్యులకు సూచించింది.ఇమ్రాన్ ఆరోగ్యం క్షీణించిందన్న వార్తల నేపథ్యంలో ఆయన మద్దతుదారులు, పాకిస్తాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. ఆయనను, ఆయన భార్య బుష్రా బీబీని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తాండూరులో కల్తీ కోవా కలకలం..160 కిలోలు స్వాధీనం!

తాండూరు పట్టణ కేంద్రంలో కల్తీ కోవా వ్యవహారం కలకలం రేపింది

జహీరాబాద్ నుంచి తాండూరు పట్టణానికి

తీసుకువచ్చి విక్రయిస్తున్న కల్తీ ముఠా.

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 18, తాండూరు :

తాండూరు పట్టణ కేంద్రంలో కల్తీ కోవా వ్యవహారం కలకలం రేపింది. రూ.30 వేల విలువైన కల్తీ కోవా, కల్తీ కళాఖాన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ నుంచి తాండూరు పట్టణానికి తీసుకువచ్చి విక్రయిస్తున్న కల్తీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో దాడి చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడు రూపారామ్‌ను పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. 160 కిలోల కల్తీ కోవా, 14 కిలోల కల్తీ కళాఖాన్‌ను సీజ్ చేశారు. ఈ కల్తీ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపి, కల్తీకి చెక్ పెట్టే దిశగా చర్యలు తీసుకుంటామని పట్టణ పోలీసులు తెలిపారు.